సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 1 । ఆగస్టు । 2024



గిరిజనులకు మెరుగైన వైద్యం

ఆస్పత్రులకు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. 8లో



మ్యూజియం పనులు వేగవంతం

తాజంగిలోని స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో



ముంపులోనే రహదారులు

శబరినది వరదనీరు ఇంకా రహదారులపైనే నిలిచి ఉండటంతో బుధవారం కూడా పలు ప్రాంతాలకు రాకపోకలు సాగలేదు. 8లో

న్యూస్‌రీల్

మోదమ్మకు శాకంబరి అలంకరణ

- దర్శించుకున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



అమ్మవారి సన్నిధలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: మండలంలోని నక్కలపుట్టులోని మోదకొండమ్మతల్లి విగ్రహాన్ని బుధవారం వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అలంకరించారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి కూడా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిగినాపల్లి క్వారీలో బేస్ క్యాంప్ ఏర్పాటుకు చర్యలు

- పెదవలస రేంజర్ శివరజని



కొయ్యూరు: మండలంలోని సిగినాపల్లి క్వారీకి రక్షణ కల్పించడతో పాటు అటవీ రక్షణకు వీలుగా బేస్ క్యాంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పెదవలస రేంజర్ శివరజని వెల్లడించారు. బుధవారం ఆమె కొయ్యూరులో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో సిగినాపల్లి క్వారీలో రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో నిత్యం నిఘా ఉంచేందుకు బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. బేస్ క్యాంప్ వల్ల ఇటు కలప అక్రమ రవాణాపై కూడా నిఘా ఉంటుందన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతులతో త్వరలో మండలంలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన మొక్కలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టుల పరిశీలన



బొంజంగిలో వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జి.మాడుగుల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి బుధవారం ఆయన కుంబిడిసింగి, బొంజంగి గ్రామాల్లో దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలించారు. వీటి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను తయారు చేసి అందజేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాలకు కూలిన ఇళ్ల వివరాలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీఎంఆర్ఎం రాజు, తహసీల్దార్ నరసమ్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్, సర్పంచ్ కిముడు రాంబాబు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



ఫీడర్ అంబులెన్సులో దేవి మృతదేహం

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): మండలంలోని పోతంగి పంచాయతీ బల్లుగుడ గ్రామానికి చెందిన బంగురు దేవి (27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బుధవారం ఈమె గ్రామానికి సమీపంలోని పొదల్లో పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే ఫీడర్ అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ దేవిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యాధికారి రాంబాబు నిర్ధారించారు. ఆస్పత్రికి చేరుకున్న దేవి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అరకు ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

మాచ్‌ఖండ్‌కు మంచిరోజులు

ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయాల్లో పెరుగుతున్న నీటిమట్టాలు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి ఊరట నిస్తున్నాయి. ఇప్పటి వరకు నీటికొరత కారణంగా విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు పూర్తిస్థాయిలో నీటినిల్వలు అందుబాటులో ఉన్నందున విద్యుత్ ఉత్పాదన కూడా క్రమేపీ మెరుగుపడుతోంది.

- ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో భారీ వర్షాలు
- జలాశయాల్లో పెరుగుతున్న నీటిమట్టాలు
- 21 మెగావాట్ల నుంచి 46 మెగావాట్లకు పెరిగిన విద్యుత్ ఉత్పత్తి
- పూర్తిస్థాయిలో సాధనకు శ్రమిస్తున్న ప్రాజెక్ట్ సిబ్బంది



వరద నీటితో నిండుగా డుడుమ జలాశయం



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో జనరేటర్లు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలు సంయుక్త నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. అయితే కొద్ది సంవత్సరాలుగా తరచూ జనరేటర్లు మరమ్మతులకు గురవుతున్నా ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది శ్రమిస్తూ విద్యుత్ ఉత్పత్తిని మెరుగు పరుస్తూ వచ్చారు.

- గత ఏడాది ఆగస్టులో ఆరు జనరేటర్లు వినియోగంలోకి వచ్చాయి. దీంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చాలా సంవత్సరాల తర్వాత ప్రాజెక్టులో జరిగింది. ఈ ఏడాది మార్చి నెల వరకు మెరుగ్గా ఉన్న విద్యుత్ ఉత్పత్తి నీటి సమస్యతో ఏప్రిల్ నుంచి దారుణంగా పడిపోయింది. గత మూడు నెలలుగా ఒక జనరేటర్ మాత్రమే పనిచేస్తూ 21 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతూ వచ్చింది.

డుడుమ, జోలాపుట్టులో..

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఆంధ్రా,ఒడిశా సరిహద్దు గ్రామాల్లో గత నెల రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో జలాశయాలలోకి వరదనీరు వచ్చి చేరుతోంది.

- డుడుమ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 2,590 అడుగులు కాగా బుధవారం నాటికి 2,588.80 అడుగులుగా నమోదు అయింది. జోలాపుట్టు జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా మంగళవారం నాటికి 2,734 అడుగులుగా నమోదు అయింది. గత ఏడాది ఇదే రోజుకు 2704 అడుగులు మాత్రమే ఉంది.గత ఏడాదితో పోల్చితే 30 అడుగులు జోలాపుట్టు జలాశయంలో అధికంగా ఉంది.

4,4 నంబర్ల జనరేటర్ల సాయంతో..

జలాశయాల్లో నీటిమట్టాలు పెరగడంతో ప్రస్తుతం 4,6వ నంబర్ల జనరేటర్ల సహాయంతో 46 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. మూడవ నంబరు జనరేటర్ కూడా జనరేటర్ మరికొద్ది రోజుల్లో వినియోగంలోకి తీసుకు రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఒకటో నెంబర్ జనరేటర్ మైన్ ఇన్లేట్ వాల్వ్‌లో మరమ్మతులు వల్ల పనిచేయడం లేదు. ఆధునికీకరణలో భాగంగా రెండు, ఐదవ నంబర్ల జనరేటర్లకు సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. జలాశయాల్లో పూర్తి స్థాయిలో నీరు ఉండడం, జనరేటర్లు అన్ని వినియోగంలోకి వస్తే మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి జరిగే ఆస్కారం ఉంది.ఈ దిశగా ఇరు రాష్ట్రాల ప్రాజెక్టు ఉన్నతాధికారులు సాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

> **పూర్తిస్థాయిలో ఉత్పత్తికి సన్నాహాలు**
>
> డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. నీటి నిల్వలు పెరుగుతున్నందున విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం 46 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. మూడవ నెంబర్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.
>
> – ఏపీ.సుబ్రమణేశ్వరరావు, ఎస్ఈ, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం

ఒలింపిక్స్‌లో సత్తా చాటాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



ఒలింపిక్స్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్‌లో దేశంతో పాటు ఏపీకి చెందిన క్రీడాకారులంతా సత్తా చాటాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఒలింపిక్స్ సెల్ఫీ పాయింట్‌ను ఆయన బుధవారం సాయంత్రం ప్రారంభించారు.ఒలింపిక్స్‌కు భారత్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సింధు, సాత్విక్, సాయిరాజ్, జ్యోతి, జ్యోతికశ్రీ, ధీరజ్‌లకు అభినందనలు తెలుపుతూ కలెక్టర్ తొలి సెల్ఫీ తీసుకుని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చింతూరు: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కల్వర్టులు, రహదారులను చింతూరు పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేశారు. చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ సాయంతో బుధవారం కల్వర్టులు, రహదారులను క్షుణ్ణంగా పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- మెజార్టీ ఓటర్లు ఆ పార్టీకి చెందినవారే..
- ప్రలోభాలకు తెరతీసిన కూటమి నేతలు



మహారాణిపేట : ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచే అభ్యర్థి విజయం లాంఛనమే. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న ఓటర్లలో మెజార్టీ సభ్యులు వైఎస్సార్ సీపీ చెందిన వారే ఉన్నారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రస్తుతం 822 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా పరిషత్ పరిధిలో 39 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉండాల్సి ఉండగా.. మూడు జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనకాపల్లి జిల్లా రావికమతం జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ, సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు తుంపాల అప్పారావు మరణించారు. ప్రస్తుతం ఉన్న 36 మందిలో 34 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్ సీపీకి, నర్సీపట్నం జెడ్పీటీసీ సభ్యుడు తెలుగుదేశం పార్టీకి, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు సీపీఎం పార్టీకి చెందిన వారు ఉన్నారు. అలాగే 652 మంది ఎంపీటీసీలకు గానూ ప్రస్తుతం 636 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 16 ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లకు గానూ ఒక కార్పొరేటర్ స్థానం ఖాళీగా ఉంది. 21వ వార్డు నుంచి ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. తర్వాత ఆయన జనసేనలోకి ఫిరాయించడంతో శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. ఆ స్థానానికే ఇప్పుడు ఎన్నిక జరుగుతోంది. ఇక యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో 25, నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 90 శాతం మంది వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థి విజయం నల్లేరుమీద నడకే. ఈ పరిస్థితుల్లో కూటమి నేతలు కుట్రలకు తెరతీశారు. ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అభ్యర్థిని పోటీలో నిలిపేందుకు సన్నద్ధమవుతున్నారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునాయాసంగా విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.

జెడ్పీటీసీలు	36
ఎంపీటీసీ	636
కౌన్సిలర్లు	53
కార్పొరేటర్లు	97
మొత్తం ఓటర్లు	822

అరకు ఏరియా ఆస్పత్రిలో బాలింత మృతి

అరకులోయ టౌన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఓ బాలింత మృతి చెందింది. డుంబ్రిగుడ మండలం గొంగడ గ్రామానికి చెందిన గర్భిణి వంతాల సాయిత (37) పురిటి నొప్పులతో జూలై 29వ తేదీన ఆస్పత్రిలో చేరింది. ఆమె ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది, అయితే సాయిత ఊపిరి తిత్తుల సమస్య (నిమోనియా)తో బాధపడుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యాధికారి రాము తెలిపారు. కవల పిల్లలు ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే సాయిత మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేపట్టారు.

గంగవరం పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు



ఎన్‌క్యూఏఎస్ ప్రతినిధుల బృందంతో గంగవరం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

గంగవరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు (ఎన్‌క్యూఏఎస్) గుర్తింపు లభించింది. ఈనెల 19 నుంచి 20 వరకునేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ట్స్ కమిటీ నిపుణులు శ్రీరామ (కర్ణాటక), అగస్టిన్ జోసప్ (కేరళ), రాకేష్, లలితతో కూడిన బృందం స్థానిక పీహెచ్‌సీని సందర్శించింది. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ రూమ్స్, ఇంజెక్షన్, డ్రెస్సింగ్ రూమ్, ల్యాబ్ టెస్టులు, ప్రసూతి గది, తదితర సౌకర్యాలు, రికార్డులను తనిఖీ చేసింది. అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సేవలు, సదుపాయాలపై సంతృప్తి చెందిన కమిటీ గుర్తింపు ధ్రువపత్రాన్ని జారీ చేసిందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఒండోపు భావన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష అభినందనలు తెలిపారు. ఇలావుండగా గత ప్రభుత్వ హయాంలో గంగవరం పీహెచ్‌సీకి రూ.1.50 కోట్లతో అధునాతన భవనం నిర్మించడమే కాకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించింది. పీహెచ్‌సీ కార్పొరేట్ ఆస్పత్రిలా ఉందని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం అన్నారు. జాతీయ స్థాయి గుర్తింపుపై వారు కూడా అభినందనలు తెలిపారు.

జలదిగ్బంధంలో 30 గ్రామాలు

- వాగులు పొంగడంతో నిలిచిన రాకపోకలు
- బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల్లో గిరిజనుల అవస్థలు



ఉధృతంగా ప్రవహిస్తున్న బిరిగూడ వాగును దాటుతున్న బుంగాపుట్టు గిరిజనులు



బిరిగూడ వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలో ఏకధాటిగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో మారుమూల గిరిజన గ్రామాల్లో వాగులు, గెడ్డలు వరదనీటి ప్రవాహంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల్లో 30 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వాగుపై తాత్కాలిక కల్వర్టు పది రోజులు క్రితం కొట్టుకుపోయింది. దీంతో అప్పటినుంచి రాకపోకలు సాగించేందుకు ఆయా ప్రాంతాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం లక్ష్మీపురం వారపు సంతకు దొరగూడ, ఉబ్బెంగుల, కోడాపుట్టు, మాలిపుట్టు, జబడ, రంగినిగూడ, బుంగాపుట్టు, గర్రం గ్రామాల గిరిజనులు ఉధృతంగా ప్రవహిస్తున్న బిరిగూడ వాగును అతి కష్టం మీద దాటుకొని వచ్చారు. కొంతమంది చిన్నారులను తల్లిదండ్రులు ఎత్తుకుని వాగును దాటించారు. ఉపాధ్యాయులు వాగును దాటేందుకు సాహసం చేశారు. వీరి ద్విచక్ర వాహనాలను స్థానికులు కావిడి కట్టి భుజాలపై మోస్తూ వాగును దాటించారు. బిరిగూడ వద్ద జరుగుతున్న వంతెన పనులు పూర్తి అయ్యేవరకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక కల్వర్టును పంచాయితీరాజ్ అధికారులు నిర్మించాలని ఆయా పంచాయితీల సర్పంచులు కె.త్రినాథ్, నోమిన, లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీల గిరిజనులు కోరుతున్నారు.

జిల్లాలో 190.6 ఎంఎం వర్షపాతం నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి పాడేరు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించింద. జిల్లా వ్యాప్తంగా 190.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మారేడుమిల్లిలో 38.6, కూనవరంలో 32.4, ఎటపాకలో 24.2, ముంచంగిపుట్టులో 21.4, వీఆర్‌పురంలో 16.2, చింతూరులో 12.6, అడ్డతీగలలో 11.8, దేవిపట్నంలో 10.2, గంగవరంలో 9.2, వై.రామవరంలో 7.4, జి.మాడుగులలో 2.6, పెదబయలులో 2.2, రంపచోడవరం 1.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

బచింత– పాలమామిడి రోడ్డును పూర్తి చేయండి

ట్రైబల్ వెల్ఫేర్ ఈఈకి పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



కల్వర్టుల నిర్మాణానికి వినియోగించే తూరలను పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

కొయ్యూరు: మండలంలోని బచింత- పాలమామిడి రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. బుధవారం ఆయన పాలమామిడి గ్రామాన్ని సందర్శించారు.రహదారి లేకపోవడంతో కొంత దూరం నడచి వెళ్లారు. గత ప్రభుత్వంలో రూ.8 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలోని పాఠశాల భవనానికి రూ.24 లక్షలు, తాగునీటి పథకానికి రూ.26 లక్షలు కేటాయించామని, వెంటనే టెండర్లు పిలవాలని ఆయన ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రాజును ఆదేశించారు. పాలమామిడి నుంచి జాజులబంద రకు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఈఈకి సూచించారు. నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ డీఈ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

● ప్రకృతి పరవశం





చల్లని వాతావరణం.. ఎటుచూసినా పచ్చదనంతో ఎత్తయిన కొండలు.. వీటి మధ్య నుంచి జాలువారుతూ పరవళ్లు తొక్కుతున్న డుడుమ జలపాతం.. వీటన్నింటిని కమ్మేసిన పొగమంచు.. బుధవారం కనువిందు చేసిన ఈ అపురూప దృశ్యం సందర్శకులను కట్టిపడేసింది. ప్రస్తుతం వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో జలపాతం పరిసరాల్లో మంచు తెరలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. జలపాతం అందాలను తిలకించేందుకు వచ్చేవారు ప్రకృతి అందాలకు మంత్రముగ్ధులవుతున్నారు. – ముంచంగిపుట్టు

క్లుప్తంగా

వంట కార్మికుల నియామకానికి నివేదిక

ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కొండలరావు



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న డీడీ కొండలరావు

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): వసతి గృహాల్లో విద్యార్థులకు భోజనాలు వండి వడ్డించే వంట కార్మికుల నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కొండలరావు తెలిపారు. బుధవారం మండలంలోని కించుమండ, జాముగుడ గిరిజన సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కించుమండలో జరిగిన క్యాన్సర్ వైద్య శిబిరంలో ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం జాముగుడ వసతి గృహంలో మెనూను పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ చార్ట్‌ను డైనింగ్ హాల్ వద్ద ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థులకు డీడీ భోజనాలు వడ్డించారు. హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంపులోనే రహదారులు

- రాకపోకలు సాగక అవస్థలు

చింతూరు: శబరినది వరదనీరు ఇంకా రహదారులపైనే నిలిచి ఉండటంతో బుధవారం కూడా పలు ప్రాంతాలకు రాకపోకలు కొనసాగలేదు. మండలంలోని జాతీయ రహదారి-326పై కుయిగూరువాగు వరదనీరు నిలిచి ఉన్నందున ఆంధ్రా నుంచి ఒడిశాకు రాకపోకలు ఇంకా పునరుద్ధరణ కాలేదు. జల్లివారిగూడెం, సోకిలేరు, చీకటివాగుల వరదనీరు కూడా రహదారిపై నిలిచి ఉండటంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల నడుమ చింతూరు మండలంలోని 20 గ్రామాలకు సైతం ఇంకా రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి ఎగపోటు కారణంగా శబరినది ప్రవాహం నిలకడగా ఉన్నందున వరదనీరు రహదారులను వీడడం లేదు.

ప్రపంచ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



వర ప్రసాదరావు

రంపచోడవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఆదివాసీ హక్కుల వేదిక, అధ్యక్షుడు బోండ్ల వర ప్రసాదరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆగస్టు 9న నిర్వహించ తలపెట్టిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కేంద్రంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ప్రభుత్వం ద్వారా కార్యక్రమం నిర్వహించేందుకు కృషి చేయాలని ప్రకటనలో కోరారు.

పటిష్టంగా 'ఎమ్మెల్సీ' ఎన్నికల కోడ్ అమలు

- యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- స్పష్టం చేసిన కలెక్టర్ హరేందిర ప్రసాద్
- వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్ష



వెబెక్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. సామాజిక పింఛన్ల పంపిణీ అధికారుల సమక్షంలోనే జరగాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

6న నోటిఫికేషన్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 13 వరకు నామినేషన్ల స్వీకరణ, 14న పరిశీలన, 16 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 30న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఎంసీసీ కోడ్ తక్షణం అమలు

కోడ్ అమల్లోకి వచ్చినందున వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బస్సులు, బస్ స్టేషన్లు, పబ్లిక్ ప్రదేశాల్లోని రాజకీయ పరమైన ప్రకటనలు, ఇతర చిత్రాలను తొలగించాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉన్న రాజకీయ పరమైన ఫొటోలను కూడా తొలగించాలని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, గ్రామీణ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి ఎంసీసీ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ప్రభుత్వ భవనాలు, వాహనాల వినియోగం, ఎన్నికల వ్యయం, ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికలతో సంబంధం ఉన్న ఏ ఒక్క అధికారి జిల్లాలో గాని ఇతర జిల్లాల్లో గాని రాజకీయ నాయకులకు సంబంధించిన ఎటువంటి సమావేశాలకు హాజరు కాకూడదన్నారు. స్థానిక సంస్థల సభ్యులు ఎటువంటి రాజకీయ సమావేశాలు నిర్వహించకూడదని, కలెక్టర్ ముందస్తు అనుమతితో అత్యవసర సమావేశాలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రకటనలు, కార్యక్రమాలు చేపట్టకూడదన్నారు. మంత్రులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత ప్రయాణాలకు సైరన్ కలిగిన ప్రభుత్వ వాహనాలు, పైలెట్ వాహనాలను వినియోగించకూడదని వెల్లడించారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్నికల ప్రకటనల కోసం అభ్యర్థులు ముందస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. ప్రకటనల ధ్రువీకరణ, ప్రచార వ్యయ పర్యవేక్షణ, టి.వి.చానళ్లు/ కేబుల్ నెట్‌వర్క్, ప్రైవేట్ ఎఫ్.ఎం, సినిమా హాళ్లు, పబ్లిక్ ప్లేస్‌లో ఆడియో-విజువల్ డిస్‌ప్లే, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన బల్క్ ఎస్ఎంఎస్‌లు/వాయిస్ మెసేజ్‌లు, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారాలను జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అనుమతితో మాత్రమే నిర్వహించాలన్నారు.

అధికారులు మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అధికారుల సమక్షంలో మాత్రమే జరగాలని, రాజకీయ నాయకులు, ఇతర స్థానిక సంస్థల సభ్యులు ప్రమేయం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండలంలో వీడియోగ్రఫీ బృందాలను ఏర్పాటు చేయాలని, అనధికార డబ్బు, మద్యం తరలింపును పూర్తి స్థాయిలో అరికట్టాలని ఆదేశించారు. అధికారులందరూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ, రెవెన్యూ, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

పాడేరు : విద్యుత్ సబ్ స్టేషన్లలో ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

- పాడేరు సబ్‌స్టేషన్ 11కేవీ జి.ముంచంగిపుట్టు ఫీడర్ పరిధిలో జల్లిపల్లి, పాతరాపుట్టు, దుమ్మాపుట్టు, కొత్తపల్లి గ్రామాలకు, చింతపల్లి మండలం లంబసింగి సబ్ స్టేషన్‌లో 11కేవీ తాజంగి ఫీడర్ పరిధిలోని అంజలిశనివారం, రాయమానుపనుకులు, గాజులపాలెం, జలగలగెడ్డ, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.
- కొయ్యూరు మండలం కాకరపాడు సబ్ స్టేషన్‌లోని 11 కేవీ పరిధిలో కాకరపాడు, సోలబు, పిట్టాచలం, నడింపాలెం, గింజర్తి, పెదబయలు మండలం 11కేవీ పెదబయలు రూరల్ ఫీడర్ పరిధిలోని పెదబయలు టౌన్, సీతగుంట, రోగులపేట, చట్రాయిపుట్టు, ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- అరకువ్యాలీ మండలం 11కేవీ హట్టగూడ రూరల్ ఫీడర్ పరిధిలోని గన్నెల, పెదలబుడు, లోతేరు, గరదగూడ, ప్రాంతాలలో, అనంతగిరి మండలం 11కేవీ అనంతగిరి టౌన్ ఫీడర్ పరిధిలో అనంతగిరి టౌన్, దిగువశోభ, బీసుపురం, భర్గల ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

మ్యూజియం పనులు వేగవంతం

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

చింతపల్లి (సాక్షి,పాడేరు): మండలంలోని తాజంగిలోని స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రూ.35కోట్లతో చేపట్టిన ఈ పనులు బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 15రోజులకు ఓసారి పనులు చేపట్టాల్సిన పనులపై షెడ్యూల్ రూపొందించుకోవాలని ఆదేశించారు. నిర్దేశించన లక్ష్యం మేరకు పనులు నాణ్యంగా జరగాలన్నారు. అంతకు ముందు బెన్నవరం వంతెనను పరిశీలించారు. దీని నిర్మాణానికి ఏఐబీ నిధులు రూ.2కోట్లు మంజూరు కాగా, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామని చెప్పారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్,గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు,డీఈఈ చాణక్యరావు, ఏఈఈ యాదకిషోర్, ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్ పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- మినుములూరు పీహెచ్‌సీ తనిఖీ

పాడేరు : వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. బుధవారం మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆస్పత్రి వార్డులోకి వెళ్లి వైద్యసేవలు పొందుతున్న గిరిజనులను పరామర్శించారు. అనంతరం ఆయన ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్ రోగులకు అందిస్తున్న భోజనాలకు సంబంధించి బిల్లుల చెల్లింపులో డీఎంహెచ్‌వో కార్యాలయం ఏవో నిర్లక్ష్యం చేస్తున్నారని నిర్వాహకుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఈ విషయాన్ని ఆయన డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను తక్షణమే పరిష్కారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆస్పత్రి వార్డు చిన్నపాటి వర్షానికి కారిపోతుందని దీంతో అవస్థలు పడుతున్నామని రోగులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులను వెచ్చించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆస్పత్రికి యాజమాన్యానికి సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులకు అవగాహన కల్పించేందుకు వారపు సంతల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో మలేరియా నివారణ మందు పిచికారి చేపట్టాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి గోపాలకృష్ణ, సర్పంచ్ లంకెల చిట్టమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్ మినుముల కన్నాపాత్రుడు, శరభ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

సాక్షి,పాడేరు: గంజాయి సాగు చేసేవారితోపాటు వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం పోలీసు, వ్యవసాయ, అటవీ, ఉద్యానవన, వైద్య ఆరోగ్యం, డ్వామా, డీఆర్‌డీఏ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు వల్ల సమాజంపై చెడు ప్రభావం పడుతుందన్నారు.ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఏడుగురు మంత్రులతో కమిటీ వేసిందన్నారు. గంజాయి సాగు నిర్మూలనకు మండల, గ్రామస్థాయిలో కమిటీలు వేయాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు రుపొందించాలని సూచించారు. గంజాయి సాగు విడిచిపెట్టిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామమన్నారు.

పదివేల ఎకరాల్లో ధ్వంసం: ఐజీ గోపీనాథ్‌జెట్టి

గతేడాది ఏజెన్సీలో పదివేల ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేశామని ఐజీ గోపీనాథ్‌జెట్టి తెలిపారు. 2010 నుంచి 2012 వరకు చింతపల్లిలో ఏఎస్పీగా పనిచేశానని, అప్పట్లో గంజాయి పెద్ద సమస్యగా లేదన్నారు. ఇప్పుడు విద్యాలయాలు,ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి వినియోగిస్తున్నారని ఆయన తెలిపారు. గంజాయి అనర్థాలను గిరిజనులకు వివరించాలన్నారు. వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది, కూంబింగ్ పోలీసులు గంజాయి తోటలను గుర్తించి ధ్వంసం చేయాలన్నారు. ఎస్పీ అమిత్‌బర్దర్, ఏఎస్పీ ధీరజ్, డీఆర్వో పద్మావతి, డీఎఫ్‌వో వినోద్‌కుమార్ ,జిల్లా వ్యవసాయాధికారి నందు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి రమేష్‌కుమార్‌రావు, డీడీ కొండలరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐజీ గోపీనాథ్‌జెట్టి, ఎస్పీ అమిత్‌బర్దర్

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



అంగన్‌వాడీ వర్కర్లు -హెల్పర్ల యూనియన్ కమిటీ ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రంపచోడవరం : వేతనాల పెంపు, గ్రాడ్యుటీ ఇతర డిమాండ్స్ సాధన కోసం అంగన్‌వాడీ కార్మికులు 42 రోజులపాటు వీరోచిత పోరాటం నిర్వహించారు. అంగన్‌వాడీ చరిత్రలో నిలిచిపోయే ఈ పోరాటానికి సంబంధించిన బుక్‌ను అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రారంభమైనప్పటి నుంచి డిమాండ్ల సాధకు కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అమలుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అనంతరం అంగన్వాడీ వర్కర్స్ -హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి ముద్రించిన 42 రోజుల సమ్మె పుస్తకాన్ని ఆవిష్కరించారు. భవిష్యత్ పోరాటాలకు 42 రోజుల సమ్మె ఒక దిక్సూచిగా ఉపయోగ పడుతుందని కార్మికులకు పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ సంఘం నాయకులు రామలక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగెడ్డపై రాకపోకలకు స్టీమర్ బోట్లు



నాటు పడవపై కుమ్మరిపుట్టు గ్రామానికి వెళ్తున్న సీపీఎం నేత కిల్లో సురేంద్ర తదితరులు

ముంచంగిపుట్టు: జోలాపుట్టు జలాశయం నిర్మాణం వల్ల ముప్పుకు గురైన 15గ్రామాల గిరిజనులకు మత్స్యగెడ్డపై రాకపోకల కోసం స్టీమర్ బోట్లు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామానికి బుధవారం ఆయన నాటు పడవపై ప్రయాణించి వెళ్లారు. గ్రామ గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యగెడ్డలో నీటి పెరుగుదల వల్ల కలిగే ఇబ్బందులుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోలాపుట్టు జలాశయం వల్ల ముప్పునకు గురైన గిరిజనులకు ఉచితంగా నిత్యావసర సరుకులు, పింఛన్లు, ఆరోగ్య సేవలు అన్ని ఇంటి వద్దకే అందించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డలో భారీగా వరదనీరు చేరడంతో పలు గ్రామాల గిరిజనులు నాటు పడవలపై భయం భయంగా ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి 15 గ్రామాల గిరిజనుల తాత్కాలిక ప్రయాణాల కోసం స్టీమర్ బోట్లు అందించాలన్నారు. కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు త్రినాథ్, శ్రీను, గాసి రాందొరలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



పొలంబడి కార్యక్రమంలో అధికారులు, రైతులు, తదితరులు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ తాసరుబయలు గ్రామంలో బుధవారం మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో ఐసరం హనుమంతరావు అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం జరిగింది. తాసరుబయలు గ్రామంలో పొలబడిలో భాగంగా ఐఐఎంఆర్ సమకూర్చిన 500ఎకరాలకు మిల్లెట్స్ విత్తనాలను రైతుల ద్వారా వేయించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ విజయలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి పాత్రుడు సామలు, రాగులు, కొర్రలు, జొన్నలు. ఊదలు, మొక్కజొన్న వేరుశనగ, వంటి పంటలను పరిశీలించారు.పంటలు సాగే చేసిన రైతులకు వ్యవసాయ పరంగా వ్యవసాయాధికారులు పలు సూచనలు, సలహాలను తెలియజేశారు. రైతులకు డెమో ద్రవ జీవామృతం ఏపీసీఎన్ఎఫ్ జి.మాడుగుల యూనిట్ ఐ.మహేశ్వరి రైతుల చేత తయారు చేయించి దాని ఉపయోగాలను వివరించారు. సచివాలయం సిబ్బంది వీహెచ్‌ఏలు సతీష్, జీవన్, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది, ఐసీఆర్‌పీఎస్‌లు కొండమ్మ చంద్రకళ, కృష్ణమోహన్, కొండబాబు, సోమన్నదొర, జాషువా, డమరి, రైతులు హాజరయ్యారు.

రణజిల్లెడలో కాఫీ షాపు ప్రారంభం



కాఫీ షాపును ప్రారంభిస్తున్న జేఎల్‌వో లక్ష్మి

అరకులోయ టౌన్: మండలంలోని పద్మాపురం పంచాయతీ రణజిల్లెడలో వన్మయా మహిళా రైతుల ఉత్పత్తి దారుల మాక్స్ సంస్థ , టెక్నో సర్వ్ , వాల్మార్ట్ సహకారంతో మా ఊరు కాఫీ బ్రీవింగ్ పాయింట్‌ను (కాఫీ షాపు) బుధవారం ప్రారంభమైంది. అరకులోయ కాఫీ బోర్డు జెఎల్‌ఓ వి.వి.కె.ఎం.లక్ష్మీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ వన్మయా మహిళా సంస్థ మహిళా కాఫీ రైతులకు శిక్షణ కార్యక్రమాలు మరియు కాఫీ తయారీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో మహిళల ఆర్థికాభివృద్ధి మెరుగుపడుతుందన్నారు. అరకు కాఫీ ప్రపంచస్థాయి గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. టెక్నో సర్వ్ వాల్మార్ట్ అసోసియేట్ కె.శ్రీనివాసరావు, కాఫీ బోర్డు ప్రతినిధులు జె.రవి, జి.రవి, వన్మయ సంస్థ డైరెక్టర్‌లు సంధ్య, సుశీల, గిరిరైతులు పాల్గొన్నారు.

గెడ్డలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



పాములపుట్టు సమీపంలో గెడ్డ ఒడ్డున లభ్యమైన సోమ్‌నాథ్ మృతదేహం

హుకుంపేట: మండలంలోని పాము రాయి గెడ్డలో గల్లంతైన యువకుడి మృతదేహం ఒడిశాలోని పాముల పుట్టు గ్రామం వద్ద బుధవారం ఉదయం లభ్యమైంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాములరాయి గెడ్డ దాటుతూ ప్రమాదవశాత్తు కిల్లో సోమ్‌నాథ్ (18)గల్లంతైనట్టు కుటుంబ సభ్యులు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు ఆదివారం నుంచి పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం సభ్యులు గెడ్డలో గాలింపు చర్యలు చేపట్టారు. మృత దేహం గెడ్డ ప్రవాహానికి కొట్టుకుని సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఒడిశాలోని పాములపుట్టు సమీపంలో బుధవారం ఒడ్డుకు వచ్చింది. దీనిని పాములపుట్టు గ్రామస్తులు గుర్తించి మృతుడు కుటుంబానికి సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహానికి గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కృష్ణ

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతూ అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థి శామ్యూల్ కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ క్రిష్ణ బుధవారం డిమాండ్ చేశారు. బుధవారం సప్పర్ల ఆశ్రమ పాఠశాలను సందర్శించి శామ్యూల్ మృతికి గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాలలో అందుతున్న మెనూ, వసతి సౌకర్యాలపై విద్యార్థుల నుంచి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి జీవన్‌కృష్ణ మాట్లాడుతూ అధికారులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వల్ల తరుచూ ఆశ్రమాల్లో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటివరకూ సుమారు 60 మంది ఆశ్రమ విద్యార్థులు అనారోగ్యంతో చనిపోయారని ఆయన ఆరోపించారు. తక్షణమే సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా శామ్యూల్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వి.రాజు పాల్గొన్నారు.